# విద్యార్థులు పశువులుగా కాక పశుపతిగా తయారుకావాలి

**చదువుల్ నేర్చితినంచు గర్వము వహించన్‌రాదు నీకున్న యా**
**చదువేపాటిది, విద్యకున్ వినయమే సద్రూపమౌ నేర్వద**
**గ్గది యెంతో కలదంచు గర్వదురహంకారంబులన్ బాయుడీ**
**హృది దానన్ తలపోయుచుండు సుగతీ ఓయీ అవిద్యాపతీ**

అధ్యాపకులారా! విద్యార్థినులారా!

నిత్యము ప్రతినోటను తల్లి, తండ్రి, గురువు, దైవము అనే వరుస మాటలను మనము వింటూనే వుంటాము. ఈ మాటలందు అనంతమైన అర్థము, ఆనందము, అమృతత్వము యిమిడి వుంటున్నది. పుట్టిన తక్షణమే కంటికి కనుపించునది, పాలిచ్చి పోషించునది, అన్ని విధాలా వుద్ధరించునది తల్లి. ఆమె మొట్టమొదట మన కంటికి కనుపించే స్వరూపము. ఆ మాతృమూర్తి తండ్రిని చూపిస్తుంది. తండ్రి పోషించి, ఉద్ధరించి, అభివృద్ధిని ఆశించి ఒక గురువును చూపిస్తాడు. కాని గురువు కేవలము భౌతిక విద్యలను మాత్రమే కాకుండా ఐహిక ఆముష్మికములతోపాటు అమృతత్వమైన దైవత్వాన్ని చూపిస్తాడు. ఏతావాతా తల్లి తండ్రిని, తండ్రి గురువును, గురువు దైవాన్ని చూపించి మన హృదయాలలో ప్రతిష్ఠింపచేయువారు. కనుకనే తల్లి, తండ్రి, గురువు, దైవము అనే యీ పదములు వరుసగా మనము ప్రతి ఒక్కరినోట వింటూనే వుంటాము.

### జ్ఞానమనగా అద్వైత దర్శనము

అదే విధముగా భక్తి, జ్ఞానము, వైరాగ్యము, తత్త్వము, ముక్తి యీ ఐదు పదములు ఒకదానినొకటి అనుసరించి, ఆశ్రయించి అన్యోన్యానందాన్ని అందిస్తూ వుంటాయి. భక్తి:భక్తి ప్రపత్తులచేతనే దివ్యమైన, ఏకత్వమైన, అనంతమైన జ్ఞానాన్ని అందుకోగలము.

sri sathyasaivachanamrutam

జ్ఞానమనగా అద్వైతదర్శనము. అనేకత్వమును ఆరాధన సలిపి, ఆరాధనద్వారా ఏకత్వమైన జ్ఞానస్వరూపాన్ని నిరూపింపజేస్తుంది. ఈ జ్ఞానమే 'సర్వం విష్ణుమయం జగత్' అనే తత్వాన్ని క్రమక్రమేణా నిరూపించి, ప్రాకృతమైన విషయవాంఛలనుండి వైరాగ్యాన్ని అందిస్తుంది. ఈ వైరాగ్యంచేతనే 'తత్త్వమసి', 'ప్రజ్ఞానంబ్రహ్మ', 'అయమాత్మబ్రహ్మ' 'అహంబ్రహ్మాస్మి' అనే తత్త్వజ్ఞానము కలుగుతుంది. అనగా తానెవరో, యీ జగత్తంటే యేమిటో, జీవుడంటేయేమిటో అనే విషయాన్ని చక్కగా విమర్శించి, విపులీకరించి, హృదయానికి అందిస్తుంది. దీనినే తత్త్వజ్ఞానమన్నారు. ఈ తత్త్వజ్ఞానమును పొందిన తక్షణమే సాయుజ్యము, ఐక్యత (భగవంతునితో యేకంకావటం), అద్వితీయం (రెండవది లేకుండా వుండటం) అనే యీ అద్వితీయ తత్త్వాన్ని నిరూపింపజేస్తుంది. అదియే ముక్తి. అనగా దుః ఖనివృత్తి, ఆనందప్రాప్తి.

**భాగవతము అనగా బాగవుతాం అని అర్థము**

ఈ భక్తి, జ్ఞాన, వైరాగ్య, తత్త్వ, ముక్తులను నిరూపింపజేసినట్టి ప్రత్యక్షప్రమాణ స్వరూపమే భాగవతము. భా-గ-వ-త-ము. యీ ఐదు అక్షరములు పంచప్రాణములుగా, పంచకోశములుగా, పంచేంద్రియములుగా మనలో నిత్యము ప్రకటితమౌతూనే వున్నాయి. ఈ ఐదు అక్షరముల ప్రధానతత్త్వము భక్తి జ్ఞాన వైరాగ్య మోక్షములే! 'భ' కారమునకు భక్తి, 'గ' కారమునకు జ్ఞానము, 'వ' కారమునకు వైరాగ్యము, 'త' కారమునకు తత్త్వజ్ఞానము మరియు 'మ' కారమునకు ముక్తి, గురుతులు. భాగవతము కేవలము భగవత్సంబంధమైన విషయములను ప్రబోధించటమేకాక భక్తుని ప్రవర్తనను హృదయమునకు హత్తుకొనునట్లుగా, నిత్యజీవితంలో అనుభవించేటట్లుగ భగవంతుని లీలాగుణగణ విశేషములను జోడించి ప్రబోధిస్తూవచ్చింది. భగవంతుని, భక్తుని ఏకత్వంగావించే దివ్యత్వాన్ని నిరూపించినది, భాగవతము. భాగవతమునందే సర్వస్వము యిమిడివున్నది. భాగవతము అంటే బాగవుతాం. అనగా భక్తి, జ్ఞాన, వైరాగ్య, తత్త్వములచేతనే మనం బాగుపడతాం.

## మనం ఎక్కడనుండి వచ్చామో అ స్వస్థానానికి పోయే త్రోవను వెతుక్కోవాలి

అయితే మానవజీవితం దేని నిమిత్తమై వచ్చినది? దీని ఆదర్శమేమిటి, అంతరార్థమేమిటి, దీని గమ్యమేమిటి అనే విషయాన్ని మనం చక్కగా విచారణచేస్తే, తనూ ఒక విద్యార్థియైన ప్రహ్లాదుడు తోటి విద్యార్థులతోకూడి యేమంటున్నాడు.

**దీనశుభములేదు, దివ్యకీర్తియులేదు**
**జగతిపుట్టి పుట్టి చచ్చి చచ్చి**
**పొరలనేల మనకు పుట్టని చావని**
**త్రోవ వెదుకుకొనుట దొడ్డబుద్ధి**

అన్నాడు. అయ్యా మనము చస్తున్నాము, తిరిగి పుడుతున్నాము. తిరిగి చస్తున్నాము. చావటం, పుట్టటం యిదేనా మన జీవితంయొక్క లక్ష్యం? ఇది దేహతత్త్వము కావచ్చును. కాని మన గమ్యం మాత్రం యిదికాదు. త్రో-వ-వె-తు-కు-కొ-ను-ట-దొ-డ్డ-బు-ద్ధి. ఇవి 12 అక్షరములు. ఇది ద్వాదశాక్షరముల మంత్రము. ఇదే ఏకాదశి తరువాత లభించేది. త్రోవ అనగా యే త్రోవ! మనం యింటికిపోయే త్రోవనా! లేక హాస్టలుకు పోయే త్రోవనా? Collegeకి పోయే త్రోవనా లేక సినిమాకు పోయే త్రోవనా? ఇవేవీ కాదు. వచ్చిన త్రోవను వెతుకుకొనిపోవటమే! ఎక్కడనుండి వచ్చామో అక్కడికి తిరిగిపోయే త్రోవను వెతుక్కోవాలి. అదే భాగవతముకూడా చెప్పింది. 'ఎచ్చట పుట్టెనచ్చటికి పోవ నైజము ప్రాణికోటికిన్'. మనం యెక్కడనుండి వచ్చామో ఆ స్వస్థానికి పోయి చేరే త్రోవను వెదుకుకోవాలి. ఎందుకోసం వెతుక్కోవలసివచ్చింది? మరచిపోయాము కనుకనే వెదుకోవలసివచ్చింది. ఈ భోగభాగ్యాలలో, యీ ఆనందాలలో, ఈ క్షణభంగురమైన జీవితసుఖాలలో, ఈ ఆనందడోలికలలో, ప్రాకృతసంబంధములలో మునిగి నిత్యసత్యమైన దివ్యత్వాన్ని మనము మరచిపోయినాము.

## త్రోవను మరచిపోవటమే గొడ్డు బుద్ధి; త్రోవను వెదుకుకొనుటే దొడ్డబుద్ధి

మీకందరికి తెలుసు. పుట్టిన తక్షణమే బిడ్డ. 'క్వా', 'క్వా' అని అరుస్తుంది. కోఽహం, కోఽహం అని అరవటం లేదు. ఇంతకు ముందు నేను చెప్పాను. కోఽహం అనగా

sri sathyasai vachanamrutam

'నేనెవరు?' అని. కాని దానికంటెముందు 'క్వా, క్వా, క్వా' అని అరవటంలో వున్న అంతరార్థంయేమిటి? 'క్వా' అనగా యెక్కడ? 'నా స్వస్థానం యెక్కడ' అని పుట్టిన తక్షణమే ప్రారంభిస్తుంది అన్వేషణ, యీ బిడ్డ. కాని ఆ పరితపించేది ఎంతసేపు? కొంతసేపు మాత్రమే! ఈ ప్రాకృతసంబంధమైన వాతావరణము తనలో ఆవరించెనా, తక్షణమే యీ 'క్వా' అనేది మరచిపోతుంది. తానెక్కడనుండి వచ్చాననే విషయం మరచిపోయి తనకీ ప్రపంచమే సర్వస్వమని విశ్వసించి అందులోనే మునిగిపోతుంది. అలా మరచిపోవటంచేతనే తిరిగి వేదాంతము హెచ్చరిస్తుంది, 'అయ్యా! నీవు వచ్చిన స్థానాన్ని మరచిపోయావు. నీ స్వస్థానాన్ని మరచిపోయావు. నీ స్వస్థానాన్ని మరచిపోయి యెంతకాలం పరస్థానములో వుండగలవు? ఎంతకాలం క్యాంపులో వుండగలవు? తిరిగి నీ స్వస్థానాన్ని నీవు చేరుకో!' అనే ఉపదేశమంత్రమే 'త్రోవ వెదకుకొనుట దొడ్డబుద్ధి'. త్రోవను మరచినటువంటిదే గొడ్డు బుద్ధి. ఈనాడు మనం గొడ్డు బుద్ధిలో వున్నాము. దొడ్డ బుద్ధికి మనం ప్రయాణం కావాలి. పురందరదాసుకూడా అన్నాడు.

**మరెదు నిన్నె ధరగెబందె**
**మాధవా..... మాధవా**

అనగా 'స్వామీ! నిన్ను మరచిపోటంచేతనే యీ ప్రకృతిలో వచ్చి పుట్టవలసివచ్చింది. చిన్మయరూపుడుగా వున్న నిన్ను మరచిపోయి యీ మృణ్మయరూపంలో నేను చిక్కుకున్నాను. ఈ మృణ్మయలోకానికి నేను వచ్చాను'. ప్రతి ఆస్తికుడు, జ్ఞాని, తత్త్వవేత్త ఆ లక్ష్యాన్ని హృదయమందుంచుకొని నిత్యజీవితాన్ని గడుపుతూ తిరిగి సత్యములో లీనము చేసుకుంటూవచ్చారు. ప్రతియొక్క విషయము మనము చక్కగా విచారణ సలిపి చేయాలి. అట్లుకాకపోవటంవల్లనే మనం అనేక దుఃఖములకు, కష్టములకు, విచారములకు గురౌతున్నాము. ఎన్ని చదువులు చదివినప్పటికి, ఎన్ని విద్యలు నేర్చినప్పటికి, ఎన్ని పట్టములందుకొన్నప్పటికి మనం పొందవలసింది పొందాలి. అందుకోవలసింది అందుకోవాలి. చేరవలసిన దాన్ని చేరాలి. చేరవలసింది చేరేంతవరకు, అందుకోవలసింది అందుకొనేంతవరకు, తెలుసుకోవలసింది తెలుసుకొనేంతవరకు మనకు భయమే!

తెలుసుకోవలసింది సత్యము, పొందవలసింది అమృతత్వము. విడువవలసింది అనిత్యము. అనిత్యమైన జగత్తుని వదలి, సత్యమైన భగవంతుని స్మరించి, నిత్యమైన అమృతత్వాన్ని మనం చేరాలి. అదే మనము నిత్యప్రార్థనలో చేసేటువంటిది.

**అసతోమా సద్గమయ**
**తమసోమా జ్యోతిర్గమయ**
**మృత్యోర్మా అమృతంగమయ**

**ఆత్మను మరచి అన్నాన్ని వెతుకుతున్నాము**

మనం వేరే యెక్కడనుండి రాలేదు. ఆత్మనుండి వచ్చాము. ఆత్మను మరచి అన్నాన్ని వెతుకుతున్నాము. ఆత్మను వెతకటంకోసం మనము వచ్చాము. చేతిలో నీ ముఖాన్ని చూసుకోమని అద్దాన్ని పెడితే, ఈ అద్దము మరొకరి ముందు పెడితే నీ ముఖం యే రీతిగా కనుపిస్తుంది? యితరుల బుద్ధులంతా యే రీతిగా వుంటున్నాయని మనం విచారణ చేస్తున్నాము. అనుసరిస్తూ వస్తున్నాము. తన బుద్ధి, మనసు, ప్రవర్తన యెట్లా వుంది, అని ఎవరికి వారు విచారించటానికి యేమాత్రము ప్రయత్నించటంలేదు. తనను తాను విచారించాలి. తన తత్వాన్ని తాను గుర్తించాలి. అప్పుడే మానవత్వం సార్థకమవుతుంది. కనుక, వచ్చిన స్థానాన్ని మనం మరచిపోకూడదు. అదే మనకు నిత్యసత్యమైన అమృతత్వము. అదే ఆనందతత్వము. అదే నిత్యత్వము. అలాంటి అమరత్వమైన అమృతత్వాన్ని మరచిపోయి అనృతత్వంలో మునిగి, అనేక విధములైన అశాంతులకు గురైపోతున్నాము.

**ఈ జగత్తులో ఈనాడు కావలిసినవి రెండే రెండు-దానము, నామము**

విద్యార్థినులారా! ఏనాటికైనా మీరు ఆదర్శప్రాయులైన మాతృమూర్తులుగా తయారుకావాలి. మీ పిల్లలకు, తోటి మానవులకు తగిన మార్గాన్ని బోధించాలి. మనం సంసారాన్ని ఆశించవలసిందే; కాని, ప్రేమించవలసిందికాదు. ప్రేమించవలసింది ప్రేమతత్వమైన ఆత్మతత్వమునే. మనం సంసారమును అనుభవించవచ్చును. కాని, ఆశించటం చాలా పొరపాటు. ఇలాంటి పవిత్రమైన వయసులో మనం మంచి మాటలు



srisathyasaivachanamrutam

వినాలి. మంచి పనులు చెయ్యాలి. మంచి జీవితాన్ని గడుపుకోవాలి. అదే మానవత్వానికి తగిన సార్థకత. నేను అప్పుడప్పుడు చెప్తూవుంటాను

**మాట ఒకటి వినరే, మంచిమాట ఒకటి వినరే..**
**మాట వినక పిచ్చి ఆటలాడుదురే**
**మాటిమాటికి రాదు మానవ జన్మము**
**బాట ఒకటేరా.... బాయకురా దాని నీవు.. ||మాట||**

మంచిమాటలు వినాలి. మంచి విషయాలు చింతించాలి. మంచి బోధలు చెయ్యాలి. మంచి నడతలో వుండాలి. ఇదే నిజమైన విద్య. విద్య అనగా గ్రంథపరిచయముకాదు. అనేక పర్యాయములు చెప్పాను. ఏదో జగత్తులో భౌతికంగా, వ్యావహారిక జీవితంలో యీ విద్యలు మనకు అవసరమే! కానీ పారమార్థిక జీవితంలో యీ విద్యలకు అతీతమైన నిజతత్త్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి. మనం యీనాడు గుర్తించవలసినది గమ్యాన్ని. అప్పుడే జీవితం ధన్యమౌతుంది. నిత్యము యే కొంతకాలమైనా భగవన్నామ స్మరణ చేయటానికి ప్రయత్నించండి. మనకు యీనాడు జగత్తులో కావలసినవి రెండే రెండు పదార్థములు-ఒకటి దానము, రెండవది నామము. దానము అనగా యేదానము? అన్నదానము. నామము అనగా యేనామము? హరినామము. హరినామమే మన జీవితనావ. అన్నదానమే మన జీవితగమ్యము. ఎందుకంటే అన్నమయమైన దేహముతో అన్నమును దానము చేసినప్పుడే హరినామము హృదయములో ప్రతిష్ఠ అవుతుంది. ఆత్మ అనగా ప్రత్యేకమైనటువంటిదికాదు. మన హృదయమునకే శృతులు 'ఆత్మ' అని పేరు పెట్టినాయి. శ్రుతులు పెట్టినపేరేగాని ఈ ఆత్మ నీవు పెట్టిన పేరు కాదు. ఎవరో పెట్టినదికాదు. నీ పేరేమిటంటే నా పేరు రాముడు, నాపేరు కృష్ణుడు, నాపేరు సుశీల, పుష్ప అని యీ విధంగా పెట్టుకోటంకాదు. ఇవి తల్లి తండ్రులు పెట్టిన పేర్లు. నీ పేరు యేమిటంటే, నీపేరు మొట్టమొదట హృదయమే! ఆత్మ, ఆనందము, అమృతత్వము. నిత్యసత్యమైన ఆ పేరును నిలుపుకోటానికి ప్రయత్నంచేయాలి. ఇదే సార్థకనామము.

sri sathyasai vachanamrutam

## పేరుకు తగిన ప్రవర్తన ఉండాలి

త్యాగరాజుదికూడా సార్థకనామం. తంజావూరు రాజు ధన, కనక, వస్తు, వాహనాదులంతా అతనింటికి పంపాడు. అప్పుడు త్యాగరాజు 'నిధి చాలా సుఖమా? రాముని సన్నిధి చాలా సుఖమా? నిజముగ తెలుపు మనసా' అని తన మనస్సును ప్రశ్నించుకున్నాడు. ఈశ్వర సన్నిధి నాకు నిజమైన సన్నిధి. నాకు నిజమైన సుఖము. ఈ నిధి యెంతకాలము వుంటుంది? అంతా కదలిపోయే మేఘాలు. Passing clouds, come and go వచ్చి, పోయేవి. ఇవి నాకు ప్రధానంకాదు అనే బుద్ధితో త్యాగం చేశాడు. అందుచేతనే అతనికి 'త్యాగరాజు' అనే పేరు సార్థకమైంది. త్యాగములో రాజంతటివాడు. ఎవరైనా యీనాడు ధనాన్నిచూస్తే అతడు యెంతటి ధనవంతుడైనా, కోటీశ్వరుడైనా చివరకు చాలా మలినమైన రూపాయినోటు కనిపించినాకూడా అందుకొని జేబులో పెట్టుకొంటాడు. వదలి పెట్టిపోడు. ఈనాడు ధనాన్ని ఆశించనివారు లేరు. కాని, నిరుపేదగా వుండిన త్యాగరాజు సర్వ భాగ్యాలను త్యజించాడు. అదే త్యాగరాజు లక్షణము. 'సౌందర్యరాజన్' అని పేరు పెట్టుకుంటారు. కాని, మనిషి చూస్తే వికారంగా వుంటాడు. 'సత్యం' అని పేరు పెట్టుకుంటే మనం సత్యాన్ని పలకాలి. 'శాంతమ్మ' అని పేరు పెట్టుకొంటే శాంతంగా వుండాలి. ముక్కుపైన కోపం పెట్టుకొని అందరిపైన పోట్లాడటానికి ప్రయత్నం చేయకూడదు. పేరుకు తగిన ప్రవర్తన సరిగా చక్కగా వుండాలి.

## అన్నమయముతో ప్రారంభమై ఆనందమయమువరకు ప్రయాణం చెయ్యాలి

మనకున్నని పంచకోశములు. యీ దేహము అన్నమయ, ప్రాణమయము, సంచారము. అనగా చైతన్యస్వరూపము. మనోమయము భావములయొక్క చేరిక. విజ్ఞానమయము విచారణశక్తి. ఇది జరిగిన తరువాతనే ఆనందమయము. ఈ ఆనందమయము మనకు యెప్పుడు లభిస్తుంది? అన్నమయముతో ప్రారంభమై ఆనందమయంవరకు మనం ప్రయాణం చెయ్యాలి. అంతవరకు మనం ఆగకూడదు. కాని, యీనాడు మన ప్రయాణం అన్నమయముతో ప్రారంభమై అన్నమయంతోనే అంతమౌతోంది. అది మన జీవిత గమ్యంకాదు. మానవుడై పుట్టి, 'జంతూనాం నరజన్మ దుర్లభం' అని అనిపించుకొని,

srisathyasaivachanamrutam

మనము మానవులవలె బ్రతకకుండా పశువులవలె బ్రతుకుతున్నాము. 'నేను మానవుడు' అనేది half truth. అది అర్ధ సత్యమే! 'నేను పశువును కాదు'. ఇది అర్ధ సత్యం. ఈ రెండింటిని చేర్చినప్పుడు full truth అవుతుంది. కనుక 'నేను మానవుడు, పశువుకాదు' యీ విధమైన విచారణ చెయ్యాలి. మానవుడు అనుకుంటూ తిరిగి మనం పశుప్రవర్తనలో మునుగుతున్నామంటే మానవత్వానికి సార్ధకత యేముంది? 'నేను పశుత్వంలో ప్రవేశించకూడదు. ఇతరులను యేమాత్రము నొప్పించకూడదు. బాధించకూడదు. హింసించకూడదు'. ఈ విధమైన అహింసా ధర్మము మనలో ఆవిర్భవించాలంటే దైవప్రీతి, పాపభీతి, సంఘనీతి అనే మూడే మూడు అనుసరించాలి. అనేక పర్యాయములు చెప్పాను. మానవత్వాన్ని పెంచుకోవాలి.

**మానవ హృదయంలో మానవ భావాలు ఉండాలి**

మానవత్వంలేని మానవుడు ఆకారమానవుడు మాత్రమే! అలాంటి ఆకారమానవత్వంలో ఆకర్షణశక్తి శూన్యమై పోతుంది. ఈ గులాబివద్దకు యేతుమ్మెదను మనం పిలువనక్కరలేదు. అదే వచ్చి దానిపై వాలుతుంది. కాని, plastic గులాబి పుష్పముపై తుమ్మెద వచ్చి వాలుతుందా? వాలదు. ఎందువల్ల? అక్కడ మకరందంలేదు, సుగంధంలేదు. కనుకనే, మానవ హృదయంలో మానవభావాలు వుండాలి. మానవభావాలు మనలో ఆవిర్భవించినప్పుడే మనం నిజమైన మానవులుగా తయారౌతాము. లేకపోతే ఆకారమానవులమే! Artificial man. ఇది మనకు సరైనదికాదు. Art is outside. Heart is inside. Art అంతా heart నుండి వచ్చింది. Art ని follow చేసి heart ని మరచిపోతున్నాము.

**పరమాత్మ ప్రేమను సాధించాలి**

Love is God. మొట్టమొదట పరమాత్ముని ప్రేమించాలి. మనము జీవితములో పొందవలసిన అన్ని సౌభాగ్యములకంటే, అన్ని కోరికలకంటే, ఫలితములకంటే మొట్టమొదట సాధించవలసినది పరమాత్మప్రేమనే. అదే Love of God. అది ఒక్కటి వుండెనా ఇక అన్నీ సమకూరుతాయి. యితరులను బాధించకూడదు. అదికూడా

sri sathyasai vachanamrutam

ప్రేమస్వరూపము, ప్రేమనిలయము. ఇంకొకరిని బాధించటానికి, హింసించటానికి ప్రయత్నించదు. అందువల్లనే fear of sin. అక్కడనే పాపభీతి బయలుదేరుతుంది. దైవప్రీతితోబాటు పాపభీతి వెంటనే జంటనే వస్తుంటుంది. ఈ పాపభీతి, దైవప్రీతి రెండింటినీ చేర్చినప్పుడు morality in society. సమాజములో నీతి మనం పెంచుకుంటాము. ఆ నీతే మన జాతి. అదే మన జీవితానికి జ్యోతి. కనుక నీతిని పెంచుకోటానికి ప్రయత్నించండి. జాతిలేనివాడు వుండవచ్చును. కానీ నీతిలేనివాడుంటే ప్రమాదమైపోతుంది. నీతి అనగా మంచి నడత. ఈ మంచి నడతతో కూడినప్పుడే నిజమైన విద్య

**జాతిగౌరవంబు నీతిపై నిలుచును**
**నీతిలేకయున్న జాతిచెడును**
**నీతిగల్గుజాతి నిజమైన జాతిరా**
**వినుడు భారతీయసుతుడ**

ఆ జాతియే నిజమైన మానవజాతి. కనుక మనం మానవులనుకున్నందుకు నీతిని, సరియైన నడతను, ఆదర్శవంతమైన జీవితాన్ని గడపుకోటానికి ప్రయత్నించాలి. యిన్ని గ్రంథములు చదివి, యిన్ని విధాల శిక్షణపొందినదానికి తగిన ఫలితము లేకపోతే ఏమి ప్రయోజనము? పెద్దపెద్ద మూటల మాదిరి bags పుస్తకాలంతా మోసుకురావటము. ఈ చదువు చదివిన తరువాత మనకి పని యేమాత్రము వుండదు. ఉద్యోగాలు మనకు దక్కవు. ఏ బస్సుస్టాండులోనో మూటలు మోసి బ్రతకాలని యీనాటినుండే మనం మూటలు మోయటం practice చేస్తున్నాము. ఇంత చదువుకున్నందుకు యిదా మనం చేయటము? మనము బానిసలు కాకూడదు. పశువు బానిసై ప్రపంచానికి అణిగిమణిగి వుంటుంది. నరుడు నారాయణుగా మారిపోయి యీ ప్రపంచాన్ని పాలించే నాయకుడుగా తయారుకావాలి. పశువుగాకాక పశుపతిగా తయారుకావాలి. అలాంటి విద్యను మనము యీనాడు అభ్యసించాలి. 'అధ్యాత్మ విద్యా విద్యానాం' అని, అన్ని విద్యలకంటె అధ్యాత్మ విద్య అత్యవసరమైనది.

srisathyasaivachanamrutam

**దైవప్రీతి, పాపభీతి, సంఘనీతి-ఈ మూడు గుణాలను అనుసరిస్తే మనం దైవస్వరూపులుగా మారుతాము**

మానవతావిలువలు, 'సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస' అన్నారు. వీటిని మనము అనుసరించిననాడు ఇతరులకు explain చేయటానికిగాని లేదా యితరుల మనసులను inspire చేయటానికిగాని అవకాశంవుంటుంది. Love of God. Who is God? Truth is God. ఆ సత్యాన్ని నీవు ప్రేమించు. అక్కడ సత్యము, ప్రేమ రెండు చేరిపోయినవి. Fear of sinలో అహింస ప్రారంభమౌతుంది. ఇంకొకరిని బాధించకూడదు. నొప్పించకూడదు. హింసించకూడదు. ఇక్కడ భయం వస్తుంది. కాబట్టి హింసచేయరు. ఎప్పుడు హింసలేకుండా వుంటుందో, అప్పుడు శాంతి సహజంగా ఆవిర్భవిస్తుంది. శాంతి, అహింస అందులో చేరివుంటున్నాయి. సమాజములో ధైర్యంగా బ్రతకటమే ధర్మము. కనుక సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస ఇవన్నీ అందులోనే వుంటున్నాయి. సత్యధర్మశాంతిప్రేమఅహింసలనే పంచ ప్రాణములలోపల మూడే మూడు మనం select చేసుకోవచ్చు. అవే Love of God, fear of sin, morality in society. ముచ్చటగా యీ మూడు గుణాలను మనం ప్రేమిస్తే, పోషిస్తే మనం దైవస్వరూపులుగా తయారౌతాము.

ఎక్కువగా మీరు చెప్పనక్కరలేదు. చదవనక్కరలేదు. పాఠాలు మాత్రం మీరు చక్కగా చదువుకుంటూ, యీ మూడింటిని చక్కగా నిలుపుకొని మానవత్వాన్ని సార్థకం చేసుకుంటారని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 31-12-1987న అనంతపురం కళాశాలలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam